ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 13 మార్చి 2024

లెక్కల భూములు



- చుక్కల భూములతో లక్షల్లో లంచాల పంట
- జాబితా నుంచి తొలగించాలంటే భూమి రేటు బట్టి అమ్యామ్యాలు డిమాండ్
- వైసీపీ నేతల భూములకేమో మోక్షం
- సామాన్యుల భూములకు కలగని విముక్తి
- అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోతున్న బాధితులు
- ఏసీబీ దాడులతో లంచాల వ్యవహారం బట్టబయలు

(కడప-ఆంధ్రజ్యోతి): చుక్కల భూముల మాటున కొందరు వైసీపీ నేతలు విలువైన భూములు కొట్టేశారు. అలాగే కొందరు వైసీపీ నేతలకు చెందిన విలువైన భూములకు చుక్కల బారినుంచి విముక్తి కలిగించారు. సామాన్య రైతులు మాత్రం చుక్కలభూములకు విముక్తి లభించక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పెద్దలకు మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండానే చుక్కలు తొలగిపోయాయి. అధికారులకు చుక్కల భూములు కాస్త లెక్కల భూములుగా మారిపోయాయి. ప్రభుత్వం చెప్పిన మేరకు అన్ని ఆధారాలు ఉన్నా సామాన్యుల చుక్కల భూములకు విముక్తి దొరకడం లేదు. చివరికి డబ్బులు ఇస్తే మాత్రం ఆ పనులు చకచకా జరిగిపోతున్నాయి. అధికారుల తీరుతో విసిగిపోయిన వీరపునాయునిపల్లె మండలం వెల్దురి గ్రామానికి చెందిన శేఖర్ అనే రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం మరోమారు వెలుగులోకి వచ్చింది.

వీరపునాయునిపల్లె మండలం వెల్దుర్తి రెవెన్యూ పొలం సర్వే నెం.451లో శేఖర్ అనే రైతుకు 6.64 ఎకరాల భూమి ఉంది. దానిని చుక్కల జాబితా నుంచి తొలగించేందుకు ఇన్నాళ్లు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాడు. ఈ భూమికి సంబంధించిన ఆర్టీఐ సమాచారం కోరడంతో వీరపునాయునిపల్లె డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ రూ.5 వేలు డిమాండ్ చేశారు. అప్పటికే విసుగుచెందిన ఆయన నేరుగా ఏసీబీని ఆశ్రయించడంతో చంద్రశేఖర్ ఏసీబీ గాలానికి చిక్కి సస్పెండ్ అయ్యాడు. చివరకు ఆయన ఫైలు కడప కలెక్టరేట్‌లోని డి-సెక్షన్‌కు పంపించారు. అయితే ఆ ఫైలు క్లియర్ చేయాలంటే ఆ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రమీల రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. తొలుత రూ.50వేలు ఇవ్వాలని కోరారు. దీంతో ఆ రైతు మరోమారి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ధీఓ సోమవారం సూపరింటెండెంట్ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం కలకలం రేపితే.. చుక్కల భూమి నుంచి క్లియర్ కావాలంటే రెవెన్యూ వారికి లక్షలు ముట్టచెప్పాలన్నది మరోమారు తేటతెల్లం అయింది.

చుక్కల భూముల సమస్య పరిష్కారానికి 2017లో చంద్రబాబునాయుడు చట్టం తీసుకువచ్చారు. 22 నిషేధితజాబితాలో 'ఏ' నుంచి 'ఈ' వరకు క్లాజులున్నాయి. 'ఏ' లో ప్రభుత్వం ఇచ్చే పట్టాలు ఉండగా, 'ఈ'లో రిజిస్టరు డాక్యుమెంట్లు ఉన్నా కూడా చుక్కల భూముల జాబితాలో ఉన్నాయి. వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పట్లో అది కార్యరూపం దాల్చకముందే ప్రభుత్వం మారింది. కాగా.. గత ఏడాది మార్చి నెలలో చుక్కల భూముల వ్యవహారాన్ని సుమోటాగా తీసుకుని తొలగించాలంటూ సీసీఎల్ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. జీవో నెం.152 ప్రకారం మార్చిలో కలెక్టరు జీవో ఇచ్చారు. జిల్లాలో అప్పట్లో 18,225 ఎకరాల చుక్కల భూములు ఉన్నాయి. 1బీ నకలు, పాస్ పుస్తకం, ఈసీ, ఆర్‌హెచ్, ఫేర్ అడంగల్, ఎస్ఎంబీ ఇలా ఏదో ఒకటి వారు పరిశీలించి చుక్కల భూమి నుంచి తొలగించాలి. ఎన్నో ఏళ్లుగా చుక్కల భూమి సమస్యతో విసిగిపోయిన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకున్నారు. ఇక సమస్య పరిష్కారం అవుతుందనుకున్నారు. అయితే 2023 మార్చిలో ఇచ్చిన జీవో ప్రకారం సుమోటోగా స్వీకరించాల్సిన భూములను 'ఈ' జాబితా నుంచి 'ఏ' లోకి చేర్చారు. 'ఏ' లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చినట్టుగా రాస్తారు. అయితే వాటి పరిష్కారం కోసం మళ్లీ మండల స్థాయి తహశీల్దారు నుంచి ఆర్డీఓ కార్యాలయం.. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు తీసుకువచ్చేంత వరకు రైతులు నానా కష్టాలు పడుతూ వస్తున్నారు. సామాన్యులకు చెందిన వందల ఫైళ్లు కడపలో పెండింగులో ఉన్నాయి.

ఆరేళ్లుగా తిరుగుతున్నా..

బద్వేలు మండలంలోని రాజుపాలెం గ్రామంలోనే సుమారు 58 మందికి పైగా రైతులకు చెందిన భూములు చుక్కల జాబితాలో ఉన్నాయి. అక్కడ ఓ రైతు ఆరేళ్లుగా అంటే 2018 నుంచి అన్ని ఆధారాలు జత చేసి చుక్కల భూముల నుంచి విముక్తి కల్పించాలని తిరుగుతున్నా కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వైసీపీ నేతలకు చెందిన భూములకు చుక్కల భూముల నుంచి చకాచకా విముక్తి కల్పించారంటారు. ఇక వారు కొనుగోలు చేసిన డీకేటీ భూములకు కూడా పూర్వపు పట్టాల పేరిట క్లియరెన్స్ ఇచ్చారంటారు. సామాన్యులకు మాత్రం చుక్కలు చూపుతున్నారు.

భూమిని బట్టి డిమాండ్

సీఎం జగన్ ఎలాంటి అవినీతి అక్రమాలకు లంచాలకు తావు లేకండా సంక్షేమ పథకాలు ఇస్తున్నామంటూ గొప్పగా ఎలివేషన్ ఇస్తుంటారు. చుక్కల భూముల మాటున రెవెన్యూలో జరిగే వసూళ్లు మాత్రం ఆయనకు కనిపించవంటున్నారు. కంటికి రెప్పచాటు అన్నట్లుగా గతంలో రెవెన్యూలో లంచాలు జరిగేవంటారు. ఇప్పుడు చుక్కల భూముల వ్యవహారంలో మాత్రం వైసీపీ నేతలు భూదందాల్లో ఎలా సెటిల్‌మెంట్లు చేస్తున్నారో అలానే ఇక్క కూడా భూ విలువ బట్టి అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తుండడం చూసి బాధితులు అవాక్కవుతున్నారు. ఓ అధికారి అయితే భూమి వాటి తాలూకూ వివరాలను వారి వేగులద్వారా తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో ఎకరా ఎంత పోతుందో విలువ కట్టి ఇంత ఇస్తే ఫైలు క్లియర్ అవుతుందంటూ ముఖాన్నే చెబుతుండడం చూసి బాధితులు ఆశ్చర్యపోతున్నారంటారు. అంత ఇచ్చుకోలేం సార్ అంటే.. మీ భూమి విలువ అంత ఉంది, మీరు ఇచ్చే డబ్బు మాకే కాదు కదా, మాపైస్థాయికి కూడా ముట్టచెప్పాలంటూ ఉన్నత స్థాయి అధికారుల పేర్లు కూడా వాడుతున్నట్లు సమాచారం. బయటికి చెబితే పనులు కావని కొందరు అప్పులు సప్పులు చేసి డబ్బులు పనిచేయించుకుంటూ ఉండగా, కొందరు వారు ఇచ్చిన డబ్బులు కట్టలేక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రిజిస్టరులో అన్ని ఆధారాలు ఉన్నా కూడా చుక్కల బూముల కారణంగా క్రయవిక్రయాలు జరగక ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల పెళ్లిళ్లకో, చదువులకో అమ్ముకుందామంటే వీలుకాని పరిస్థితి. చుక్కల జాబితా నుంచి తీసేయాలంటే డబ్బులు ఇస్తే కానీ క్లియర్ కాని పరిస్థితి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చివరికి విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.



రంగసముద్రం మండలంలో ఆన్‌లైన్ కాని భూమి

కలెక్టరు కరుణించినా





పెద్ద వెంకటసుబ్బయ్య, నడిపి వెంకటసుబ్బయ్య

ఈ ఫోటోలో కనిపిస్తున్న రైతులు పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లెకు చెందిన పెద్దవెంకటసుబ్బయ్య, నడిపి వెంకటసుబ్బయ్యలు. వీరికి రంగసముద్రం రెవెన్యూపొలంలో సర్వేనెంబర్ 431లో 5.40 ఎకరాల భూమి ఉంది. ఇది వారసత్వంగా వచ్చింది. ఆర్ఎస్ఆర్‌లో చుక్కల భూమిగా నమోదైంది. దీన్ని తొలగించేందుకు కలెక్టరుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి డాక్యుమెంటు పరిశీలించి చుక్కల జాబితా నుంచి తొలగించాలంటూ 2022 మార్చి 11న ఆదేశాలు ఇచ్చారు. సర్వేనెం.431లో పునుగుపాటి నడిపి వెంకటసుబ్బయ్యకు 3.18 ఎకరాలు, పెద్దవెంకటసుబ్బయ్య పేరున 431/2లో 50 సెంట్లు, 431/3లో 1.63 సెంట్ల సబ్ డివిజన్‌కూడా అయింది. ఆన్‌లైన్‌లో నమోదు కావాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఆ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఎన్నిసార్లు చెప్పినా కూడా పట్టించుకోలేదు. కలెక్టరు ఆదేశాలే అమలు కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

- జగన్మోహన్‌రెడ్డిని ఓడిస్తేనే స్థానిక సంస్థలకు మనుగడ
- ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప(రూరల్), మార్చి 12: నిధులు, విధులు, అధికారాలను కాలరాస్తూ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, కౌన్సిలర్లకు, కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్స్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... సీఎం జగన్మోహన్‌రెడ్డి గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రజలకు చెందిన వేల కోట్ల నిధులను దారిమళ్లించి సొంత అవసరాలకు, సొంత పథకాలకు వాడుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేలకోట్ల రూపాయలను ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌ల సంతకాలు లేకుండా దారి మళ్లించిందన్నారు. జగన్‌ను ఆయన పార్టీని ఇంటికి పంపిస్తేనే గ్రామాలకు, గ్రామపంచాయతీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 3 కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజల నిధులను, స్థానిక సంస్థల అధికారాలను, విధులను ఎలా దోచుకున్నది సాక్ష్యాధారాలతో సహా వివరించి జగన్మోహన్‌రెడ్డి ఓటమికి కృషి చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా స్థానికసంస్థల ప్రజాప్రతినిధులను చైతన్య పరుస్తున్నామన్నారు. 'జగన్‌ను ఓడిస్తేనే మన మనుగడ' అనే నినాదంతో ఇప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు చిత్తశుద్ధితో పట్టుదలగా పనిచేయాలని పిలుపునిచ్చామన్నారు. అధికార పార్టీ వైసీపీ సర్పంచ్‌లు కూడా తమ పిలుపుకు స్పందిస్తున్నారన్నారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేశ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల కడుపు కొడుతున్న సీఎంను ఇంటికి పంపినప్పుడే పంచాయతీరాజ్ వ్యవస్థకు మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిన కర్ణాటక, తెలంగాణలలో ఆయా ప్రభుత్వాలు పతనం చెందాయన్నారు. ఏపీలో కూడా వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు ప్రభుత్వ వైఫల్యాలను, వ్యవస్థకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి వైసీపీని ఓడించాలన్నారు. టీడీపీ అధినేత, ప్రతి పక్షనాయకుడు చంద్రబాబునాయుడు గ్రామ పంచాయతీలకు, సర్పంచ్‌లకు జీతబత్యాలు, విధులు, నిధులు గతంలో ఎలా ఇచ్చామో తాము అధికారంలోకి రాగానే అలాగే ఇస్తామని హామీ ఇచ్చారని ఈ మేరకు టీడీపీని గెలిపించాలన్నారు. అనంతరం డీఆర్‌వో గంగాధరగౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు జల్లు కొండయ్య, చుక్కా ధనుంజయ యాదవ్, చింతా కిరణ్‌యాదవ్, పార్థసారథిరెడ్డి, శివరామిరెడ్డి, పుత్తా ఎల్లారెడ్డి, యనమల సుధాకర్, పాలపు వాసు, సంగటి గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పులివెందుల రాష్ట్రానికే ఆదర్శమా..?

- సీఎం చెల్లెలికే సొంతూరిలో రక్షణ లేదు
- చిన్నాన్న హత్యకు గురై ఐదేళ్లయినా కేసు కొలిక్కిరాలేదు
- తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 12: పులివెందుల రాష్ట్రానికే ఆదర్శమని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రి చిన్నాన్న పులివెందుల పట్టణంలో హత్యకు గురై ఐదేళ్లు కావస్తున్నా ఆ కేసు ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదన్నారు. తనకు తన కుటుంబానికి పులివెందుల్లో రక్షణ లేదని ముఖ్యమంత్రి చెల్లెలు డాక్టర్ సునీతరెడ్డి కడప ఎస్పీకి లేఖ రాయడాన్ని ఆదర్శమంటారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది, జూదం విచ్చలవిడిగా సాగుతోంది, బెట్టింగులు సర్వసాధారణం, వేటకొడవళ్లు వేటాడుతున్నాయి, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారడంలో ఆదర్శమా అని ప్రశ్నించారు. పైడిపాళెం రిజర్వాయర్, లింగాల కుడి కాల్వ, గండికోట-సీబీఆర్ ఎత్తిపోతల, జేఎన్టీయూ, ట్రిపుల్‌ఐటీ, అంతర్జాతీయ పశుపరిశోధన కేంద్రం, శిల్పారామం, రింగురోడ్లు, భూగర్భడ్రైనేజీ, సిమెంటు రోడ్లు, పులివెందుల-కడప నాలుగులేన్ల రహదారి.. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనలో జరిగాయన్నారు. కాగా.. భారత రాజ్యాంగానికి, లౌకికవాదానికి, ముస్లిం సమాజానికి పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేకమని తులసిరెడ్డి అన్నారు. 2019 డిసెంబరులో మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పుడే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న జేసీ గణేశ్‌కుమార్

కమలాపురం రూరల్, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని జేసీ గణేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని అందుకు సంబంధించి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో ఒక వ్యక్తికి ఒకే బాధ్యత చెప్పాలని రెండు బాధ్యతలు అప్పజెపితే రెంటికీ న్యాయం చేయలేడని అధికారులకు తెలిపారు. మీకు కేటాయించిన విధుల గురించి తెలపాలని జేసీ కోరగా వారి నుంచి సరైన సమాధానం రాలేదు. ఎన్నికల విధుల్లో భాగంగా మీకు అవగాహన లేకపోతే ఎలా అని జేసీ ప్రశ్నించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సుబ్రమణ్యం, ఆరు మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటన స్థలంలో లేని వ్యక్తిపై కేసులు పెట్టడం దుర్మార్గం : టీడీపీ

కడప(ఎడ్యుకేషన్), మార్చి 12: సంఘటన స్థలంలో లేని వ్యక్తిపై కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుత్తా నరసింహారెడ్డి, ఆయన కుటుంబీకులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి రాక్షసానందం పొందుతున్నారని, అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరిం చారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని తెలిపారు.

ఆర్టీసీకి శివరాత్రి ఆదాయం రూ.67,71,204

కడప (మారుతీనగర్), మార్చి 12: మహాశివరాత్రి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలకు కడప రీజియన్ పరిధిలోని డిపోల నుంచి సుమారు 264 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సుల ద్వారా రూ.67,71,204 ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 105 బస్సుల ద్వారా రూ.32,12,343, బద్వేల్ డిపో 38 బస్సుల ద్వారా రూ.9,11,397, జమ్మలమడుగు డిపో నుంచి 10 బస్సుల ద్వారా రూ.1,21,328. మైదుకూరు డిపో నుంచి 33 బస్సుల ద్వారా రూ.7,16,984, ప్రొద్దుటూరు డిపో నుంచి 32 బస్సుల ద్వారా రూ.6,77,358, పులివెందుల డిపో నుంచి 28 బస్సుల ద్వారా రూ.7,31,794 ఆదాయం వచ్చిందన్నారు.

అర్హులకు అన్యాయం చేశారు

- ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయంటూ అభ్యర్థుల ఆందోళన
- అభ్యర్థులను లోనికి రానీయకుండా తలుపులు వేసిన రిమ్స్ సిబ్బంది



తలుపులు మూసివేయడంతో అభ్యర్థుల నిరీక్షణ


కడప(సెవెన్‌రోడ్స్), మార్చి 12: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని క్యాన్సర్ కేర్, మెంటల్ ఆసుపత్రి, పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల భర్తీకి గత డిసెంబరులో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆయా ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్స్, రేడియాలజీ, ఈసీజీ టెక్నీషియన్స్, ఫిజియోథెరపిస్టులు తదితర 26 విభాగాలకు సంబంధించి 208 మంది సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉద్యోగాల భర్తీలో చాలా అవకతవకలు జరిగాయని అర్హులకు అన్యాయం జరిగిందంటూ మంగళవారం కొంతమంది అభ్యర్థులు రిమ్స్ కళాశాల వద్ద ఆందోళన చేశారు. ఉద్యోగాల భర్తీలో నిబంధనలు పాటించకుండా, పత్రాల పరిశీలన చేయకుండానే మార్కులు వేసి అర్హులకు అన్యాయం చేశారంటూ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

జీఓ కంటే సర్క్యులరే గొప్పట

ఉద్యోగాల భర్తీలో జీవో కంటే సర్క్యులరే గొప్ప అని రిమ్స్ సిబ్బంది వితండ వాదం చేస్తున్నట్లు అభ్యర్థులు తెలిపారు. ఈసీజీ టెక్నీషియన్ కోర్సు కాలవ్యవధి గతంలో ఒక సంవత్సరం ఉండేది. 2017 నుంచి కోర్సు కాల వ్యవధి రెండేళ్లు చేశారు. నోటిఫికేషన్ ప్రకారం వన్ ఇయర్ ఈసీజీ టెక్నీషియన్ కోర్సు చేసిన వారు అనర్హులని అధికారులు అంటున్నారు. జీవోలో మాత్రం అర్హులని ఉన్నప్పటికీ సర్క్యులర్‌లో లేదంటూ అర్హత కలిగిన అభ్యర్థికి మొండిచేయి చూపారు. వన్ ఇయర్ కోర్సు చేసిన ఈసీజీ టెక్నీషియన్లు ఐదుగురికి గత ఏడాది జీజీహెచ్‌లో ఉద్యోగాలు ఇవ్వడం గమనార్హం. మరో అభ్యర్థి 2018లో పాసైతే 2016లో పాసైనట్లు చూపి అదనంగా మార్కులు వేశారు. మరికొంత మందికి కొవిడ్ సమయంలో సర్వీసుకు వెయిటేజీ వేయకుండానే మార్కులు చూపారు. వీటిపై అభ్యర్థులు ప్రశ్నిస్తుంటే రిమ్స్ వైద్యకళాశాలలో సమాధానాలు ఎవరూ చెప్పకపోవడం గమనార్హం.

ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై ఇప్పటికే కలెక్టరుకు, వైద్యఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టరు గత వారం సమీక్ష ఏర్పాటు చేసి పరిశీలన చేయాలని ఆదేశించారు. నియామకాల అవకతవకలపై కమిటీ పరిశీలన చేసి అభ్యర్థులతో మాట్లాడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఉన్నతాధికారులు లోతుగా పరిశీలన చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. కాగా.. నియామకాలు పొందిన వారి పత్రాలు పరిశీలించేందుకు ఉదయం 9గంటలకు రమ్మన్న రిమ్స్ సిబ్బంది.. అభ్యర్థులను ఒంటిగంట వరకు లోనికి అనుమతించలేదు. తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్న పలువురు అభ్యర్థులు సైతం రిమ్స్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఇక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడింది. అభ్యర్థులు అసహనానికి గురై రిమ్స్ సిబ్బందితో వాదులాటకు దిగాల్సి వచ్చింది.


జీవో చూపినా వినడం లేదు



- వెంకటశారద, అభ్యర్థి, కడప

నేను ఈసీజీ టెక్నీషియన్ కోర్సు చేసే సమయానికి ఒక సంవత్సరం కోర్సు ఉండింది. 2012లో నేను ఈ కోర్సు చేశాను. 2017 నుంచి రెండు సంవత్సరాల కోర్సు ప్రవేశపెట్టారు. ఇప్పుడు నాకు అర్హత ఉన్నా సర్క్యులర్‌లో లేదంటూ నన్ను పక్కన బెట్టారు. జీవోలో ఉన్నా గత సంవత్సరం జీజీహెచ్‌లో ఐదుగురు ఉద్యోగాలు పొందినా ఇప్పుడు లేదనడం ఏందో నాకు అర్థం కావడంలేదు. నేను జీవో తెచ్చి చూపినా నా సమస్యను ఎవరూ వినడంలేదు. కొవిడ్ విధులు నిర్వ హించినా ఆ వెయిటేజీ కూడా ఇవ్వలేదు.

గుడ్డిగా అదనపు మార్కులు వేశారు



- లక్ష్మిప్రసన్న, అభ్యర్థి, కమలాపురం

పులివెందుల ఆసుపత్రికి సంబంధించి లైబ్రరీ అసిస్టెంటు పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాను. నాకు 60.72 మార్కులు ఉన్నాయి. మరొక అభ్యర్థి 2018లో పాస్ అయితే 2016లో పాస్ అయినట్లు చూపి అదనంగా మార్కులు వేయడంతో నాకు అన్యాయం జరిగింది. ఇలా గుడ్డిగా పత్రాల పరిశీలన ఎలా చేస్తారో అర్థం కావడంలేదు. ఈ విషయం చెప్పడానికి పలుమార్లు వచ్చినా సిబ్బంది లోనికి పంపడం లేదు. కళ్లెదుటే ఇంత అన్యాయం జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు ఉన్నారు.

ఎవరికీ అన్యాయం జరగనివ్వం

- డాక్టర్ సురేఖ, రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపల్, కడప

అభ్యర్థులకు ఎవరికీ అన్యాయం జరగదు. స్క్రూటినీ చేసేటప్పుడు ఎక్కడో పొరపాటు జరిగింది. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాం. వీటిని పరిశీలించి న్యాయం చేస్తాం. అర్హత ఉండి ఉద్యోగం పొందకుండా ఉండే అవకాశం లేదు. ఎవరికీ అన్యాయం జరగదు. జరిగిన పొరపాట్లు సవరించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం.

నేటి నుంచి కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12: కోయంబత్తూరు నుంచి కడప మీదుగా బుధవారం ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టరు షేక్ ఉమర్ బాషా తెలిపారు. కోయంబత్తూరు నుంచి భగత్‌కీకోటి (06181)కి రైలు ఈ నెల 14, 21, 28 ఏప్రిల్ 4 తేదీ వరకు అలాగే.. భగత్‌కీకోటి నుంచి కోయంబత్తూరుకు (06182) రైలు ఈ నెల 17, 24, 31, ఏప్రిల్ 7న నడనున్నట్లు తెలిపారు. కోయంబత్తూరులో ప్రతి గురువారం అర్ధరాత్రి 2.30గంటలకు బయల్దేరి కడపకు అదేరోజు మధ్యాహ్నం 1.55గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ఎర్రగుంట్ల 2.30కి రానుందన్నారు. అక్కడ నుంచి గుత్తి, డోన్‌మీదుగా కాచిగూడ, నాందేడ్, అహ్మదాబాద్ మీదుగా భగత్‌కీకోటి రైల్వేస్టేషన్ చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో భగత్‌కీకోటి నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం 7.30కు బయల్దేరి మంగళవారం సాయంత్రం 5.25గంటలకు ఎర్రగుంట్లకు 6గంటలకు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడ నుంచి కోయంబత్తూరుకు బుధవారం ఉదయం 9.30గంటలకు వెళతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాత్రికి రాత్రి పేదల స్థలాలు ఆక్రమణ

- కొత్తకోడూరులో వైసీపీ నేతలు ఆగడాలు
- అధికారులు హెచ్చరించినా పట్టించుకోని వైనం

రైల్వేకోడూరు, మార్చి 12: ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జా చేయడం అధికార వైసీపీ నేతలకు పరిపాటిగా మారింది. తాజాగా రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలోని కొత్తకోడూరులో ఖాళీగా ఉన్న స్థలాలను కొందరు అధికార పార్టీ నేతలు రాత్రికి రాత్రి ఆక్రమిస్తున్నారు. రాత్రి సమయంలో ముగ్గుపిండితో స్కెచ్చులు వేయడం ఉదయాన్నే ఈ జాగా నాది అంటూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014లో కొత్తకోడూరులో ఇందిరమ్మ-3 పథకం కింద పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి సుమారు 25 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 500 పైచిలుకు ఇంటి స్థలాలను పేదలకు పంపిణీ చేశారు. హౌసింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణాలు చేపట్టారు. దీంతో చాలా మంది ఇల్లు కట్టుకుని నివాసాలు ఉంటున్నారు. ఇదే స్థలంలో చాలా మంది ఇళ్లు కట్టుకోకపోవడం, బోగస్ పేర్లతో ఇంటి స్థలాలు ఉండడం, ఊరిలో లేని వారికి పట్టాలు ఇవ్వడం జరిగింది. అలాగే పాఠశాల, గ్రౌండు, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలం, అంగన్‌వాడీ కేంద్రం తదితర వాటి కోసం స్థలాలు ఎంపిక చేశారు.

ఈ స్థలాలకు సంబంధించిన ఫైలు లేక పోవడంతో 2022లో స్థానిక రెవెన్యూ శాఖాధికారులు స్థలాను క్షుణ్ణంగా పరిశీలించి... ఖాళీగా ఉన్న సుమారు 200 పట్టాలను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ స్థలా లపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటం... వచ్చే ఎన్నికల్లో అధికారంలో ఉంటామో లేదో అని భావించి కొందరు ఈ స్థలాలను కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పేదల పేరు చెప్పి రాత్రికి రాత్రే స్కెచ్ వేసి ఉదయానికి పనులు చేపడుతున్నారు. ఖాళీ స్థలాలను చదును చేసి మట్టి, ఇసుక తదితర వాటిని తరలించారు. ఈ విషయం తెలిసిన స్థానిక రెవెన్యూశాఖాధికారులు అక్కడకు వెళ్లి హెచ్చరించినా ఆక్రమణదారులు ఖాతరు చేయడం లేదు. పనులు మాత్రం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కొత్తకోడూరులో పేదలకు కేటాయించిన స్థలాల ఆక్రమణలపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ఆక్ర మణలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము.

-శివరాముడు, తహసీల్దార్, రైల్వేకోడూరు



కొత్తకోడూరులో ఖాళీగా ఉన్న స్థలాన్ని చదును చేసిన దృశ్యం



ఖాళీ స్థలాల చదును కోసం మట్టి తరలించిన దృశ్యం

గంగమ్మ హుండీ ఆదాయం రూ.18.96 లక్షలు

లక్కిరెడ్డిపల్లె మార్చి 12: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ జాతరకు సంబంధించి రెండు రోజుల హుండీని లెక్కించగా రూ.18,96,057లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు తెలిపారు. దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ ఛైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, సర్పం చులు వెంకనారాయణ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యనమల రాజబాబు, ఆలయ కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో మంగళవారం హుండీని లెక్కించారు. టికెట్లు ఆదాయం రూ.7,21, 350, హుండీ ద్వారా రూ.11,74,707లతో పాటు బంగారు నగలు, వెండి నగలు వచ్చి నట్లు ఆయన తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.2లక్షల ఎక్కువ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చెల్లు గంగాధర, రామయ్య, శ్రీనివాసులు, సురేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సమరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం

చక్రాయపేట, మార్చి 12: గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళాన్ని దాతలు అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. అనంతపురం పట్టణం మారుతీనగర్‌కు చెందిన కడపల్లి శేషు, కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని మంగళవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డికి అందించారన్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందించారని తెలిపారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డి

బైకు అదుపు తప్పి యువకుడు మృతి

చెన్నూరు, మార్చి 12: మండలంలోని ఉప్పరపల్లె నుంచి పుష్పగిరికి వెళ్లే దారిలో కేసీ ఉప కాల్వ వద్ద బైకు అదుపు తప్పి వల్లూరి కిరణ్‌కుమార్ (22) అనే యువకుడు మృతి చెందాడు. సీఐ పార్థసారథి వివరాల మేరకు... శివాలపల్లెకు చెందిన కిరణ్‌కుమార్ సోమవారం రాత్రి తన సొంత పనుల నిమిత్తం చెన్నూరుకు వచ్చి శివాలపల్లెకు వెళ్లే క్రమంలో గ్రామ సమీపంలోని కేసీ ఉపకాల్వ వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



వల్లూరి కిరణ్‌కుమార్ మృతదేహం

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 12: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులు, ఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు రిజర్వు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలైన్స్ టీమ్స్ వీడియో సర్వైలైన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ తదితర అన్ని రకాల ఏర్పాట్లు పక్కాగా ఉండేటట్లు చూడాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించా లన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ మెటీరియల్ సరఫరా లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాల పర్యవేక్షణపై చర్యలు చేపట్టాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన ఫారం-6 నుంచి 8 వరకు అన్ని పక్కాగా తనిఖీ చేసి జాబితా సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన విధులను పక్కాగా నిర్వహించాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రతి ఒక్కరూ ఛాలెంజ్‌గా తీసుకొని ఎటువంటి చిన్నపొరపాటు కూడా జరగకుండా ఎన్నికలు నిర్వహించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఏఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎఫ్‌వో శుభం, డీఆర్‌వో సత్యనారాయణ, నోడల్ అధికారులు, ఆర్‌వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నజీముద్దీన్



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ నజీముద్దీన్

కడప (నాగరాజుపేట), మార్చి 12: దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నజీముద్దీన్ ఎంపికయ్యారు. నంద్యాల జిల్లా నంద్యాల పట్టణంలో ఆదివారం రాత్రి దంత వైద్యుల సంఘం రాష్ట్ర సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర నలు మూలల నుంచి దంత వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ షేక్ నజీముద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డెంటల్ సర్జన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గడ్డం రాజేష్ (కర్నూలు) ఈ ప్రతిపాదనను ఆమోదించారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ సంతోష్ (నంద్యాల), ట్రెజరర్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి (అనంతపురం), డాక్టర్ వసీమ్ (కర్నూలు), డాక్టర్ సందా ఆకాశ్ (గోకుల్ డెంటల్), డాక్టర్ కుమార్ పాల్గొన్నారు.

పశుగ్రాసం అగ్నికి ఆహుతి

- రూ. 2 లక్షల నష్టపోయామని బాధితుల ఆవేదన



కాలిపోయిన వేరుశనగ వామి

గాలివీడు, మార్చి 12: ఆకతాయిలు చేసిన పనులకు మూగజీవాల మేత అగ్నికి ఆహుతైంది. పశువుల మేత కోసం అహర్నిశలు కష్టపడి పోగు చేసుకున్న వేరుశనగవామి అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. వివరాల్లోకి వెళితే.... మండలంలోని నూలివీడు పంచాయతీ జిల్లావాండ్లపల్లెకు చెందిన నక్కల సుమిత్రమ్మ, మడక కృష్ణయ్యలు రబీ సీజన్‌లో బోరుబావి కింద 7 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. పంట వడుచుకున్న అనంతరం వేరుశనగ కట్టెను వామిగా అమర్చుకున్నారు. మంగళవారం సాయంత్రం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వేరుశనగ వామికి నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదయ్యాంది. దీంతో దాదాపుగా రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

14 మందిపై కేసు నమోదు

కొండాపురం, మార్చి 12 : మురుగు నీరు విషయమై ఘర్షణపడిన ఘటనలో ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక రామసుబ్బారెడ్డి కాలనీలో మురుగు నీటి విషయమై నాగమ్మ అనే ఎస్సీ మహిళపై మల్కాపురం చెన్నమ్మ అనే మహిళతో పాటు మరో ఆరుగురు దాడి చేయగా వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అదే విధంగా తమపై కూడా దాడి చేశారని మల్కాపురం చెన్నమ్మ ఫిర్యాదు మేరకు.. నాగమ్మ మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు. మొత్తం 14 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

రామాపురం, మార్చి 12: మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ తూపల్లెలో మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలను అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెల యజమాని వెంకట్రమణ తన కుటుంబ పోషణ కోసం అప్పు చేసి గొర్రెలను కొనుగోలు చేసి పెంచుకుంటున్నాడు. ఇంటికి సమీపంలో కంచెను ఏర్పాటు చేసి రాత్రి సమయంలో గొర్రెల మందను తోలుకునేవాడు. మంగళవారం తెల్లవారు జామున ఒక్కసారిగా కుక్కలు గొర్రెల మందలో పడి దాడి చేశాయి. దీంతో 10 గొర్రెలు మృతి చెందగా.. మరో 10 గొర్రెలకు తీవ్రగాయాలైనట్లు తెలిపారు. గొర్రెల మృతితో సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రామాపురం ఇన్‌చార్జి పశువైద్య అధికారి డాక్టర్ మహేశ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలకు శవ పరీక్ష నిర్వహించారు. గొర్రెల యజమాని ఇన్సూరెన్స్ చేసుకొని ఉంటే బీమా వచ్చేదని డాక్టర్ తెలిపారు.

వీరభద్రుడికి మహానైవేద్యం

- వైభవంగా రథోత్సవం

రాయచోటిటౌన్, మార్చి 12: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం, మహానైవేద్య ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం వీరభద్రాలయం ముందు భాగంలో పుంగనూరు వాస్తవ్యులు చిత్తారి మఠాధిపతి విరూపాక్ష స్వామి శిష్యులు శ్రీమఠం రెడ్డి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిగుండం వేసి అందులో మొక్కుబడులు ఉన్న భక్తులు నిప్పులపై నడిచి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో రుద్రహోమాన్ని నిర్వహించారు. వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి సాయంత్రం 4 గంటల నుంచి కేరళ వాయిద్యం, టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చెక్కభజన భజన, కోలాటం కార్యక్రమాలతో పట్టణ పురవీధుల్లో రథంపై ఊరేగారు. మహానైవేద్య ఘట్టం అటహాసంగా జరిగింది. స్వామివారి నైవేద్యాన్ని కుప్పగా పోసి అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ఈనైవేద్యాన్ని తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.



మహానైవేద్యాన్ని స్వీకరిస్తున్న భక్తులు



రాయచోటి పురవీధుల్లో రథంపై స్వామి ఊరేగింపు

సీమ చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12: అనంతపురం రాయలసీమ సాంస్కృతిక వేదిక వేమన అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో రాయలసీమ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ పూర్వ విద్యార్థి గంపా మల్లయ్యకు రూ.ఐదు వేల విలువగల ప్రథమ బహుమతి లభించింది. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 118 మంది చిత్రకారులు 125 చిత్రాలను గీయగా, అందులో ఆయనకు ప్రథమ బహుమతి లభించింది. గాలెమ్మ ఊరేగింపు అనే కాన్సెప్ట్‌పై చిత్రలేఖనం గీశారు.



ప్రథమ బహుమతి పొందిన చిత్రం

ముగిసిన గంగమ్మ తిరుణాల

సికెదిన్నె, మార్చి 12: మండలంలో గంగమ్మ తిరుణాల ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు ఎంతో ఉత్సాహంగా సాగిన తిరుణాల భక్తుల కోలాహలం మధ్య మంగళవారంతో ముగిసింది. రెండవ రోజు అమ్మవారి సన్నిధిలో చెక్కభజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులకు కనువిందు చేశారు. దాతలు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు అందించి భక్తులకు సహకరించారు.



కోలాటం నిర్వహిస్తున్న దృశ్యం

సమగ్ర శిక్ష కొత్త లోగో

समग्र शिक्षा Samagra Shiksha

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12: విద్యామంత్రిత్వ శాఖ, పాఠశాల విద్య అక్షరాస్యత విభాగం సమగ్ర శిక్ష కొత్త లోగోను ఆమోదించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని అధికారిక సంప్రదింపులు, కార్యక్రమాల్లో కొత్త లోగోను వినియోగించాలని అధికారులకు సూచించారు. 2018-19 విద్యాసంవత్సరంలో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం సమగ్ర శిక్ష పథకాన్ని ప్రారంభించిందన్నారు. పాఠశాల విద్యలో భాగంగా ప్రీ స్కూలు నుంచి 12వ తరగతి వరకు పిల్లలందరికీ సమానమైన సమ్మిళిత తరగతి గది, వాతావరణంలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడాలన్న లక్ష్యంతో ఈ పథకం పనిచేస్తుందన్నారు. విభిన్న నేపథ్యం, బహుభాషా అవసరాలు, విభిన్న విద్య సామర్థ్యాలు, అభ్యసన ప్రక్రియల్లో విద్యార్థులను చురుగ్గా పాల్గొనేలా సమగ్రశిక్ష కృషి చేస్తోందన్నారు. ఈ పథకం ఐదేళ్ల కాలానికి అంటే 2021-22 నుంచి 2025-26 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం... కాపాడిన పోలీసులు

సిద్దవటం, మార్చి 12: మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో రైల్వే పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు కాపాడారు. మంగళవారం మధ్యాహ్నం భాకరాపేట సమీపంలోని రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి ఉండటం గమనించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, నాగరాజు సంఘటనా స్థలికి చేరుకుని రైల్వే పట్టాలపై ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి పరిశీలించారు. అతను రైలు కింద పడి చనిపోవాలనే ఉద్దేశ్యంతో విషద్రావణం తాగి ఉన్నట్లు గుర్తించారు. అతన్ని కాపాడి బంధువులకు సమాచారం ఇచ్చారు. మనస్థాపానికి గురికాకుండా నచ్చచెప్పి వెంటనే 108 అంబు లెన్సులో కడప రిమ్స్‌కు పంపించారు. ఆ వ్యక్తికి ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. ఇతను బద్వేలుకు చెందిన వెంకటసుబ్బయ్యగా గుర్తించామని.. కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు.



వ్యక్తిని కాపాడి తీసుకెళుతున్న పోలీసులు

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

బద్వేలు టౌన్, మార్చి 12: మున్సిపల్ పరిధిలోని నౌషాద్ థియేటరు సమీపంలో శ్రావణి (30) అనే మహిళ మంగళవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు 8 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. ఈమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై ఆందోళన

కడప (క్రైం), మార్చి 12 : కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు స్పెన్సర్స్ వెనక వైపు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం పట్ల మంగళవారం కొంత మంది బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. వివరాలిలా.. నాగరాజుపేట గ్రామ పొలంలోని 20 సెంట్లు స్థలాన్ని కలెక్టరు విజయరామరాజు విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. అయితే ఇక్కడ కొంత మంది స్థానికులకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ స్థలాన్ని చదును చేసేందుకు విద్యుత్ అధికారులు రాగా పట్టాలు పొందిన కొంత మంది యంత్రాలను అడ్డుకున్నారు. తమకు సంబంధించిన ఇళ్ల పునాదులు మట్టి కింద ఉన్నాయని.. ఇటీవల మట్టి తోలడంతో కనిపించడం లేదని అధికారులకు తెలిపారు. ఇందుకు అధికారులు ఒప్పుకోకుండా మీ వద్ద ఏమైనా ఆధారాలు ఉంటే కలెక్టరును కలవాలని తెలిపారు. చిన్నచౌకు పోలీసులకు విద్యుత్ అధికారులు ఫిర్యాదు చేయగా వారు వచ్చిసమస్య ఉంటే ఉన్నతాధికారి వద్దకు వెళ్లాలని, పనులను అడ్డుకోవద్దని హెచ్చరించారు. బాధితులు తమ వద్ద కోర్టు స్టే ఆర్డరు కూడా ఉందని విద్యుత్ అధికారులకు తెలిపినప్పటికీ వారు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కలెక్టరు ఈ స్థలం కేటాయించారని చెప్పి యంత్రాలతో క్లీన్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మా ఇంటిని కూల్చి సబ్‌స్టేషన్ కడుతున్నారు

గతంలో ఎమ్మార్వో డిఫారం ఇచ్చారు. 30 ఏళ్ల నుంచి గుంతలు పూడ్చుకుని ఇల్లు నిర్మించుకున్నా. మూడేళ్ల క్రితం వచ్చిన వర్షాల కారణంగా ఇళ్లు ఖాళీ చేసి బాడుగకు ఉన్నాం. అధికారులు 2021లో తమ ఇంటిని కూల్చారని.. అయితే తాము కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నప్పటికీ అధికారులు బెదిరిస్తున్నారు. ఇంటిపన్ను, కరెంటు బిల్లులు కూడా చెల్లించామని చెప్పినా ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసుకోమని చెబుతున్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలి.

-చంద్రమ్మ, బాధితురాలు



వచ్చే ఎన్నికల్లో రానున్నది రామరాజ్యమే: పుత్తా

● 100 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరిక

వల్లూరు, మార్చి 12 : రానున్నది రామరాజ్యమేనని టీడీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని తోళ్లగంగపల్లెలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుత్తా నరసింహారెడ్డిహాజరై మాట్లాడారు. హామీలను అమలు చేయలేని సీఎం జగన్ కాలం పూర్తయిందని, రాబోవు కాలంలో రామరాజ్యం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే జనసేన, బీజేపీ సమూహంతో విజయఢంకా మోగించి ఏపీలో జన రంజక పాలన కొనసాగిస్తామన్నారు. వీరి వెంట కమలాపురం జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి, టీడీటపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి , శివకేశవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఓబుల్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, జనసేన రఫి తదితరులు పాల్గొన్నారు.

పుత్తా ఆధ్వర్యంలో భారీగా చేరికలు

తోళ్లగంగనపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగం గా పుత్తా ఆధ్వర్యంలో థెరిసానగర్, అంబవరం గ్రామాల్లో రామసుబ్బారెడ్డి, శివకేశవరెడ్డి,లక్ష్మారెడ్డి, శంకర్‌రెడ్డి, మత్తయ్య, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో దాదాపు వంద కుటుంబాలకు పైగా టీడీపీలో చేరారు. వీరికి పుత్తా నరసింహారెడ్డి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మహిళలు ఆయనకు హారతులు పట్టారు.



థెరిసానగర్‌లో పార్టీలో చేరిన వారితో పుత్తా, టీడీపీ నాయకులు

'హామీలు వెంటనే అమలు చేయాలి'

కడప (నాగరాజుపేట), మార్చి 12 : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రైవేటు టీచర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ ఆ ఊసే ఎత్తకపోవం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక చట్టం తీసుకువస్తామన్నారు. అదీ నెరవేరలేదని, పీఎఫ్, ఈఎస్ఐ కనీస వేతనం, సెలవులు వంటి వాటిపై ప్రభుత్వం ప్రైవేటు సంస్థలతో అమలు అయ్యేలా చూస్తామన్న హామీలను గాలికి వదిలేశారన్నారు. ప్రైవేటు టీచర్లు చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు టీచర్లకు న్యాయం చేయాలని అన్నారు. లేదంటే లక్షలాది మంది ప్రైవేటు టీచర్లు జిల్లాలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారని వారి ఓట్లతో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

'సీఏఏను వెంటనే రద్దు చేయాలి'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 12 : రాజ్యాంగ విరుద్ధమైన సీఏఏను వెంటనే రద్దు చేయాలని కేంద్రం తీసుకువచ్చిన సీఏఏపై సీఎం జగన్ నోరు విప్పాలని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మగ్బుల్‌బాషా డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సీఏఏను ఆఘమేఘాలపై అమలు చేయాలని తొందరపడుతోందన్నారు. ప్రస్తుతం దేశంలో అనేక మంది పౌరులు బతుకుదెరువు కోసం ఇతర దేశాలకు వెళ్లి జీవనం గడుపుకుంటున్న సమయంలో బీజేపీ విదేశీయుల కోసం సీఏఏను తీసుకురావడం వల్ల ఎవరు నష్టపోతారనేది ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

'విభజన హామీలను తుంగలో తొక్కిన బీజేపీ'

కడప(కలెక్టరేట్), మార్చి12: ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలన్నింటినీ అమలు చేస్తామని రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తుల కెళ్లడం సిగ్గు చేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పీసీసీ డిలిగేట్ పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ పాల్గొన్నారు.

రాహుకాల దీపాలతో నిండిన విజయదుర్గా ఆలయం



రాహుకాల దీపాలను వెలిగిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి అమ్మవారు

కడప (కల్చరల్), మార్చి 12: బిల్టప్ సర్కిల్ సమీపంలో గల విజయదుర్గాదేవి ఆలయం మంగళవారం రాహుకాల దీపాలతో నిండిపోయింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి భక్తిపారవశ్యం పొందారు.

ఓటు వజ్రాయుధంలాంటిది

కడప (నాగరాజుపేట), మార్చి 12 : త్వరలో జరగబోవు అసెంబ్లీ ఎన్నికల గురించి ప్రజలు తమ ఓట్లు ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పిస్తూ కడప తాలుకా సబ్ ఇన్స్పెక్టరు ఆఫ్ పోలీసు తిరుపాల్‌నాయక్ ప్రజలకు వివరించారు. మంగళవారం నగరంలోని కాగితాలపెంట సమీపంలోని ప్రజలకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలని ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నీతినిజాయితీగా తమ ఓటును సజావుగా వేసుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధంతో సమానమని ఆయన అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి ఓటుకు అర్హులని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కమలాపురం రూరల్, మార్చి 12 : రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అసిస్టెంట్ కమాండెంట్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కమలాపురం మండల పరిధిలోని పెద్దచెప్పలి, రామాపురం, దేవరాజుపల్లె జీవంపేట, కమలాపురం మూడురోడ్ల కూడలి నుంచి గ్రామ చావిడి వరకు సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ రుషికేశవరెడ్డి, సహస్ర సీమ బల్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలు, ఫ్యాక్షన్ గ్రామాల్లో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారికి భరోసా కల్పించేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సీకేదిన్నెలో...త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని విశ్వనాథపురం, అంగడివీధి, మామిళ్లపల్లె, ఇందిరానగర్, సీకేదిన్నె రామాలయంలో సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో కవా తు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించి ప్రజలకు ఎన్నికల నేపథ్యంలో అవగాహన కలిగించి ఎన్నికల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఇన్సాఫ్ ఆధ్వర్యంలో సీఏఏ ప్రతులు దహనం

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 12 :కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు రగిల్చి మళ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సీఏఏ బిల్లు అమలుకు సిద్ధమవుతోందని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని బళ్లారి రోడ్డు అమీన్‌పీర్ దర్గా సర్కిల్ వద్ద సీఏఏ బిల్లు సంబంధించిన ప్రతులను ఇన్సాఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గౌస్, నగర ఉపాధ్యక్షులు ఎస్.హుసేన్, నాయకులు అల్తాఫ్, జాకీర్ పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

● టీడీపీ సీనియర్ నాయకుడు అమీర్‌బాబు



ఇఫ్తార్ విందులో ప్రార్థన చేస్తున్న అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12 : ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని టీడీపీ సీనియర్ నాయకుడు అమీర్‌బాబు అల్లాహ్‌ను వేడుకున్నట్లు తెలిపారు. మంగళవారం రంజాన్ మాసం మొదటిరోజున ఆస్థాన ఏ హజరత్ సయ్యద్ షా గౌస్ షర్మాద్ ఖాద్రి రహ్మంతుల్లా అలై దర్గాపీఠాధిపతి సయ్యద్‌షా ఇలియాస్‌బాషా ఖాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి జరగాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతోజీవించాలని అల్లాను వేడుకున్నట్లు తెలిపారు. అలాగే రంజాన్ మాసం శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు షేక్ ఆలీం, షేక్ పరమేశ్, షేక్ అన్వర్‌బాషా, లియాఖత్, షేక్ మస్తాన్‌వలి, ఆయుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ విద్యార్థులకు టీసీఎస్‌లో ఉద్యోగాలు

పులివెందుల రూరల్, మార్చి 12: పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో టీసీఎస్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించగా సీఎస్‌సీ బ్రాంచ్ నుంచి నలుగురు, సీఈసీ బబ్రాంచ్ నుంచి ఒక్కరు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డిలు విద్యార్థులను, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, అసిస్టెంట్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ సాంబయ్యలను అభినందించారు.

కేజీబీవీలో దరఖాస్తుల స్వీకరణ

సింహాద్రిపురం, మార్చి 12: మండలంలోని నిడివెలగల గ్రామ సమీపాన గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.గురుదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలతో పాటు 7,8,9, తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన జగన్‌రెడ్డి

● టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



మాధవీరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 12: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన జగన్‌రెడ్డి ప్రజల విశ్వాసం కోల్పోయారని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం కడప నగరం 10వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా విశ్వ ప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ, జనసేన నేత తుంగా రమణయ్యను ఆమె కలిశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో చంద్రబాబునాయుడు 19 శాతం ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం కనీసం 15 శాతం కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ప్రతి యేటా జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని, 3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి గడిచిన ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సీపీఎస్ రద్దు చేస్తానంటూ జీపీఎస్ తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను దగా చేశారన్నారు. వీటన్నింటినీ ప్రజలు చూసి విసిగిపోయారని, ప్రజల్లో వైసీపీ ప్రభుత్వం విశ్వాసం కోల్పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ ఇన్‌చార్జ్ పట్నం వెంకరటమణ, మాజీ కార్పొరేటరు అండ్లూరి రాజగోపాల్‌రెడ్డి, జనసేన నాయకుడు మాలే శివ, భరత్, చినబాబు, బోనం శిలాస్, రాజ్, శివకొండారెడ్డి, శ్రీనివాసులు, రాజాశివశంకర్, క్రిష్ణారెడ్డి, మురికినాటి సునీతతో పాటు మొగలి రామలక్ష్మమ్మ అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు ● కమిషనర్ ప్రవీణ్‌చంద్



పనులను పరిశీలిస్తున్న కమిషనరు ప్రవీణ్‌చంద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 12 : కడప నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ప్రవీణ్ చంద్ అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం కడప నగరంలో అన్నమయ్య సర్కి ల్, క్రిష్ణాసర్కిల్, పొట్టిశ్రీరాములు సర్కిల్, దేవుని కడప రోడ్డు, మాచుపల్లె సర్కిల్ మున్సిపల్ స్టేడియంలను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పర్యటించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ నాణ్యత లోపాలు లేకుండా సత్వరం పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. విద్యుత్ స్తంభాలను తరలించేందుకు, ఇతర పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అన్నమయ్య సర్కిల్ నుంచి క్రిష్ణాసర్కిల్ వరకు జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనుల్లో శ్లాబు ఏర్పాటు చేసే విధంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే క్రిష్ణాసర్కిల్ నుంచి పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకు దేవునికడప రోడ్డులో జరుగుతున్న పనులను, అలాగే మున్సిపల్ స్టేడియంలో పనులు కూడా ఆయన పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.

'వేంపల్లె పంచాయతీ అవినీతిపై విచారణ జరపాలి'

వేంపల్లె, మార్చి 2: వేంపల్లె మేజర్ పంచాయతీలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, విచారణ జరపాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాత్కాలిక సిబ్బంది ఆధ్వర్యంలో పంచాయతీలో ఎన్నో అవినీతి జరుగుతోందని తెలిపారు. గతంలో రికార్డు అసిస్టెంట్, ఇతర అధికారులు అవినీతికి పాల్పడినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వేంపల్లెలో రోడ్ల విస్తరణలో భాగంగా పనులు జరుగుతున్నాయని, ప్రజలు దుమ్ముధూళితో అల్లాడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. కేంద్రం 90 శాతం నిధులు పంచాయతీలకు ఇస్తుంటే పంచాయతీల్లో నిధులు లేవని, పనులు చేయకుండా కనీసం సక్రమంగా పారిశుధ్య పనులు కూడా చేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు.జిల్లా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మాధవీరెడ్డితోనే యువతకు భవిత: టీడీపీ

కడప (మారుతీనగర్) మార్చి 12. టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డితోనే యువతకు బంగారు భవిత లభిస్తుం దని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద గల ఆ యన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రజలతో మమేకమయ్యేలా మాధవీరెడ్డి ప్రచారాన్ని సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక స్వావలంబన, నిరుద్యోగ యువతకు ఉపాధి, పేదలకు సొంతింటి కల సాకారం, పన్నుల భారం తగ్గింపు తదితర ప్రధాన అంశాలే లక్ష్యంగా మాధవీరెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. గాలి కబుర్లు, తాయిలాలతో ఓట్లు రాలతాయని భావిస్తున్న జగన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు.

ప్రైవేట్ పాఠశాలలను సందర్శించిన ఎన్‌జీసీ అధికారి

పులివెందుల టౌన్, మార్చి 12: పట్టణంలోని స్వామి వివేకానంద, నలంద ప్రైవేట్ పాఠశాలలను సోమవారం ఎన్‌జీసీ రాష్ట్ర మానిటరింగ్ అధికారి ప్రభ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పర్యావరణం-మన బాధ్యత, ఎకో క్లబ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి, ఎంఈఓ-2 రామానాయుడు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

బచ్చుంపల్లెలో కిడ్నాపర్ కలకలం

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు

చెన్నూరు, మార్చి 12: చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బచ్చుంపల్లెలో మంగళవారం రాత్రి ఓ కిడ్నాపర్ విషయం కలకలం రేపింది. తెలుగు భాష రాని ఓ వ్యక్తి గ్రామంలో కనిపించడంతో అతన్ని కిడ్నాపర్‌గా భావించిన స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా ఇదే వ్యక్తితో పాటు మరో ఇద్దరు కలిసి మూడు రోజుల క్రితం బచ్చుంపల్లె సమీపంలోని వంక వద్ద పాఠశాల నుంచి ఓ విద్యార్థిని కొట్టి చేతులు కట్టేసి కిడ్నాప్ చేసేందుకు యత్నించాడని, ఆ బాలుడు తప్పించుకుని వచ్చాడని స్థానికులు తెలిపారు. కిడ్నాప్‌నకు పాల్పడిన ముగ్గురిలో ఓ వ్యక్తి మంగళవారం పట్టుబడిన వ్యక్తులో ఉన్నాడని స్థాని కులు పోలీసులకు తెలిపారు. కాగా ఏఎస్ఐ జాకీర్ హుస్సేన్ కిడ్నాపర్‌తో మాట్లాడగా అతనికి తెలుగు రాకపోవడంతో ఏమీ మాట్లాడటం లేదన్నారు. ప్రస్తుతానికి స్టేషన్‌లో తమ ఆధీనంలో ఉన్నాడని ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకోవాలి

● రైతు శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య

చెన్నూరు, మార్చి 12: ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించుకుంటే అది శ్రేష్టమైన పంటన ఇచ్చి తద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య అన్నారు. రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్‌బీకేలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి పెంపొందించుకోవాలని, ఈ వ్యవసాయం అనాదిగా చేస్తున్నదేనన్నారు. అయితే రైతులు దాన్ని మరిచి రసాయనిక పద్ధతులకు అలవాటుపడి పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. దీని వల్ల పంట ఖర్చు పెరగడంతో పాటు వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. కావున ప్రతి రైతు పంటల సాగులో ఆరోగ్యకర వాతావరనాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రసాయనిక ఎరువుల వాడకం తగ్గి పర్యావరణ కాలుష్యాన్ని నివారించినవారమవుతామన్నారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ ప్రకృతి వ్యవసాయంలో రూపొందించే ద్రావణాలు, కషాయాల తయారీ విధానం వాటి ఉపయోగం గురించి వివరించారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ వ్యవసాయంలో వివిధ రకాల ఉద్యాన పంటలు అనగా పండ్లు, కూరగాయలు, పసుపు, పూలతోటల్లో పోషకాలు, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచద్రవ్య, కోడిగుడ్ల ద్రావణం, పచ్చధాన్యాంతర ద్రావణం, వర్మీవాష్ వంటివి ఎంత మోతాదులో ఏయే సమయాల్లో ఎలా వాడాలన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. విత్తనం, నారుశుద్ధి, బీజామృతం ద్వారా ట్రైకోడెర్మా వినియోగంతో పాటు జీవన ఎరువుల వినియోగం, కషాయాలు, లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షిస్థావరాలు, ఎర పంటలు, అంతర పంటలు, పచ్చి రొట్ట ఎరువులు తదితర అంశాలపై అవగామన కలిగించారు. మరో శాస్త్రవేత్త సాయిమహేశ్వరి మాట్లాడుతూ ద్రవ రూపంలో సేంద్రియ ఎరువుల తయారీ, వాటిలో పోషకాలు వాడే పద్ధతుల గురించి వివరించారు. అనంతరం మండలంలోని బలసింగాయపల్లెలో బాలాజీ అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన నువ్వుల పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.



బలసింగాయపల్లెలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగైన నువ్వుల పంటను సందర్శించిన శాస్త్రవేత్తలు

గూడ్స్ షెడ్‌కు శంకుస్థాపన

ముద్దనూరు మార్చి12:స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఒక స్టేషన్, ఒక ఉత్పత్తి పథకంలో భాగంగా గూడ్స్ షెడ్ ఏర్పాటుకు శంకుస్థాపన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నరేంద్రమోదీచే నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి,దేవగుడి శివనారాయణరెడ్డి,రైల్వే అధికారులు స్క్రీన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంఎం తేజ్‌దీప్,ఏడీఈఎం రాధాక్రిష్ణయ్య, ఏఈఎం రవి, వెల్‌ఫేర్ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, స్టేషన్ మేనేజర్ భాస్కర్, చీఫ్ ఆఫీస్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, కమర్షియల్ సూపర్‌వైజర్ మహేశ్వరరెడ్డి, మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మేనిఫెస్టోను అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 12: విద్యార్థి అభివృద్ధి, సంక్షేమం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విద్యార్థి మేనిఫెస్టోను అమలు చేయాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రోషన్ జమీర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్య, నాణ్యమైన విద్యాబోధన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా అందించాలన్నారు. విద్యాబోధనలో ప్రాంతీయ బోధనలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉర్దూ, అరబిక్ విభాగాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అలీం, పట్టణాధ్యక్షుడు ఆదిల్‌ఖాన్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తుల ఖరారుతో జగన్ వెన్నులో వణుకు



ప్రొద్దుటూరు, బద్వేలులో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం.సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, వరదరాజులరెడ్డి, బొజ్జ రోశన్న, రితీష్‌రెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 12 : టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులతో వైసీపీకి ఓటమి ఖాయం అయ్యిందని జగన్ వెన్నులో అప్పుడే వణుకు మొదలైందని టీడీపీ నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమృతనగర్ హెల్త్ సెంటర్ ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: రాష్ట్రం ప్రశాంతంగా వుండాలంటే చంద్రబాబు సీఎం కావాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బొల్లవరం నుంచి రాజీవ్ సర్కిల్ వరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుకుఓటే వేసి వైసీపీని గద్దె దించాలని ప్రజల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి,ఘంటశాల వెంకటేశ్వర్లు, బచ్చల ప్రతాప్ నాగమునిరెడ్డి,వంగల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: తెలుగుదేశం పార్టీ గెలుపుతో రాష్ట్రం అభివృద్ధికి మలుపు తిరుగుతుందని బద్వేలు నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. మంగళవారం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్, కోదండరామ రైస్‌మిల్లు, ఫాతిమానగర్, శేఖర్‌హాలు వెనుకవీధి ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనుమర్లపూడి ప్రసాద్, మస్తాన్‌బాబు, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, రంజిత్, వెంకటసుబ్బయ్య, జహంగీర్ బాషా, సూర్య, చెన్నక్రిష్టారెడ్డి, వెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: చంద్రబాబు రూపొందించిన టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలు వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణమ్మ ప్రచారం నిర్వహించారు. మంగళవారం పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని తంబావీధి తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు హబీబున్నీసా, సీతా వెంకటసుబ్బయ్య, ఎస్ఎంబాషా, సెట్టెం ప్రతాప్, షరీఫ్, మస్తాన్, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కల్వకూరి రమణ, అన్వర్, ప్రొఫెసరు బాషా, డ్రైవరు ఎస్ఎంబాషా, సత్యరాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సమీక్ష సమావేశంలో ప్రొద్దుటూరు ఈఆర్‌వో కౌసర్‌భాను

ప్రొద్దుటూరు, మార్చి 12 : జిల్లాలోని సమ స్యాత్మక నియోజకవర్గాల్లో ప్రొద్దుటూరు ముఖ్యమైన దని ఇక్కడ ప్రతి ఎన్నికల అధికారి సిబ్బంది అప్రమత్తంగా వుండాలని తమకు కేటాయించిన విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించిన వెంటనే చర్యలు తప్పవని ప్రొద్దుటూరు ఈఆర్‌వో కౌసర్ భాను హెచ్చరించారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10 నుంచి సెక్టోరల్ ఆఫీసర్స్, నోడల్ ఆఫీసర్స్, బూత్‌లెవెల్ ఆఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటస్టిక్ సర్వెలెన్సు టీం, వీడియో సర్వెలెన్సు టీం, వీడియో వింగ్ టీం లతో విడివిడిగా ఆమె సమీక్ష జరిపారు. రెండు,మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున అన్ని వింగ్‌లతో ప్రత్యేకంగా సెక్టారుల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరిం చుకోవాలన్నారు. ఓటరు జాబితాలో లోపాన్నీ పూర్తి కావాలన్నారు. ఎక్కడా ఓటరు నుంచి ఫిర్యాదులు అందకుండా క్షేత్ర స్థాయిలలో పరిష్కారం కావాలన్నారు. మొత్తం బూత్‌ల వారీగా అన్ని ఏర్పాటు పూర్తికావా లన్నారు. అప్పటికప్పుడు సమస్యలు ముందరపెడితే అధికా రులు బాధ్యత పడాల్సివుంటుందన్నారు. ఈప్రక్రి యలో ఎక్కడా వలంటీర్ల సమస్య రాకూడద న్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రొద్దుటూరు లో విజయవంతంగా పూర్తిచేయాలని పిలుపుని చ్చారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఎస్పీ మురళీధర్, తహసీల్దారు విద్యాసాగర్, రాజుపాళెం తహసీల్దారు విజయశ్రీ, ప్రొద్దుటూరు రాజుపాలెం ఎంపీడీవోలు రామాంజ నేయరెడ్డి, వెంకటరెడ్డి మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, సీఐలు రమణారెడ్డి, ఎన్నిలక డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబు, డిప్యూటీ తహసీల్దారు సాయి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో కౌసర్‌భాను

100 కుటుంబాలు టీడీపీలో చేరికలు



21 వార్డులో ప్రవీణ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు, మార్చి 12 : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన నుంచి ప్రజలు విముక్తిని కోరుకుంటున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 21 వవార్డులో మాజీ కౌన్సిలర్ కాకి తిరుపతమ్మ, కాకిచంద్ర ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జబీవుల్లా, బండి భాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బాబుల్‌రెడ్డి, విశ్వనాధరెడ్డి, ఆవుల దస్తగిరి, తాటి శ్రీను, పాణ్యం సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సకాలంలో స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

మైదుకూరు, మార్చి 12 : విద్యుత్ సమస్యలపై విని యోగదారులు సమాచారం అందించిన వెంటనేప్రతి ఉద్యోగి పరిష్కారానికి వెంటనే స్పందించాలని ఎస్ఈ రమణ కోరారు. స్థానిక డీఈఈ కార్యాలయం ఆవరణలో సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలోని ఆయా మండలాల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వ్యవసాయ రంగంపై ఎక్కువ మంది రైతులు ఆధార పడ్డారని, విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. కేటాయించిన ప్రాంతంలోనే సిబ్బంది నివాసముం టూ సమస్యలపై స్పందించాలన్నారు. పగటి పూట వీధిలైట్లు వెలగకుండా చూడాలని, విద్యుత్ బాకాయి వసూళ్ళల్లో రాజీపడవద్దని కోరారు. రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమలో డీఈఈ రామిరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు, మార్చి12: అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేవరకు భూ పోరాటం సాగుతుందని బుధవారం బద్వేలు ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు.మంగళవారం బద్వేలు మండలం సి.కొత్తపల్లి రెవెన్యూ పొలంలో కొనసాగుతున్న భూ పోరాటాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేసే వరకు వ్యసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో భూ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయ కులు రమణ, ఓబులేసు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజలు ఐకమత్యంగా ఉండాలి



చెంచయ్యగారిపల్లెలో మాట్లాడుతున్న సీఐ శ్రీనాథరెడ్డి

బ్రహ్మంగారిమఠం, మార్చి 12 : రానున్న సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా గ్రామాల్లో ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని మైదుకూరు రూరల్ సీఐ శ్రీనా థరెడ్డి తెలిపారు. మంగళవారం బ్రహ్మంగారి మఠం మండలంలోని చెంచయ్యగారిపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి గ్రామ ప్రజలతో సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు మంచి వాతావరణంలో జరిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విద్యాసాగర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'సీఏఏని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి'

జమ్మలమడుగు, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సీఏఏను వెంటనే రద్దు చేయాలని దానిని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని జమ్మలమడుగు సీపీఎం పార్టీ కార్యదర్శి జి.యేసుదాసు డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు దాసరి విజయ్, దివాకర్, శ్రీను, ప్రభాకర్, రాజేష్, బాష తదితరులు పాల్గొన్నారు.


నర్శిరెడ్డిపల్లె గ్రామంలో న్యాయసలహాల సదస్సు

బ్రహ్మంగారిమఠం, మార్చి 12 : బ్రహ్మంగారిమఠం మండలంలోని నర్శిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం బద్వేలు కోర్టు జడ్జీలు గాయత్రి, పద్మశ్రీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో న్యాయసలహాల సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జడ్జీలు మాట్లాడుతూ మండల స్థాయిలో ఒక్క కేసు కూడా లేకుండా మండలం లో వెంకటాపురం, నర్శిరెడ్డిపల్లె గ్రామాలు ఎంపిక కావడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో ఏమైనా సలహాలు, సూచనలు కావాలంటే నేరుగా బద్వేలు కోర్టును ఆశ్రయించాలని ప్రజలకు తెలిపారు. అనంతరం స్వచ్ఛంద కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రసాద్, క్రిష్ణ, బ్రహ్మానందరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల మండలంలో పోలీసు కవాతు

ఎర్రగుంట్ల మార్చి12:మండలంలోని ఎర్రగుంట్ల టౌన్, పోట్లదుర్తి, చిర్రాజుపల్లె,దండుపల్లె గ్రామాల్లో మంగళవారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రశాంతంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భరోసా కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, జితేందర్‌కుమార్, చిరంజీవి, పోలీసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ అభయపథకం మహిళలకు వరం



అవగాహన కల్పిస్తున్న విజయజ్యోతి

పోరుమామిళ్ల, మార్చి 12 : ఇందిరమ్మ అభయం పథకం మహిళలకు వరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయజ్యోతి అన్నారు. మంగళవారం ఆమె రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్ కాలనీలో ఇందిరమ్మ అభయపథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద ఆడబిడ్డల కోసం ప్రతి నెలా రూ.5వేలు అర్హులైన వారికి అందించడం జరుగుతుందన్నారు. పేద కుటుంబాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్ ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు.

దుప్పి అప్పగింత

గోపవరం, మార్చి 12 : వన్యప్రాణి కుక్కల బారిన పడి ప్రాణాపాయంలో ఉండగా మల్లెంకొండ చైర్మన్ గోవిందరెడ్డి కాపాడారు. మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామానికి సమీపంలో ఉన్న బొమ్మరిల్లు రెస్టారెంటు వద్ద దుప్పిని కుక్కలు అటకాయించాయి. ఈ విషయాన్ని గమనించిన గోవిందరెడ్డి వెంటనే ఆ దుప్పిని రక్షించి అటవీశాఖ అధికారి ఖాజావల్లికి అప్పగించారు. అటవీ లోతట్టు ప్రాంతంలో మంచినీటి సమస్య ఏర్పడడంతో వన్యప్రాణులు బయటికి వస్తున్నాయి. ఈ మేరకు వన్యప్రాణులు బయటికి వచ్చినా ఎవరూ కూడా వాటికి ప్రమాదం తలపెట్టకుండా అటవీశాఖాధికారులకు అప్పగించి ఆదుకోవాలని వారు తెలిపారు.

ఆర్టీసీ బస్సు - బైకు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

బి.కోడూరు, మార్చి 12 : మండల పరిధిలోని మేకవారిపల్లెకు చెందిన పందేటి సుబ్బనారాయణ (37) బద్వేలుకు వెళ్లి తన వ్యక్తిగత పనులు ముగించుకుని బైకులో రాత్రి 9గంటలకు ఇంటికి వస్తున్నాడు. కాగా అదే సమయంలో బద్వేలు నుంచి పోరుమామిళ్ల వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటనాస్థలానికి ఎస్ఐ జయరాములు చేరుకుని జరిగిన సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుపై నమ్మకం ఉంది

● జమ్మలమడుగు టీడీపీ టిక్కెట్ నాదే : భూపేశ్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 12: చంద్రబాబు, లోకేశ్‌పై తనకు బాగా నమ్మకం ఉందని, జమ్మలమడుగులో టీడీపీ టిక్కెట్ తనకే ఇస్తారని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపాన భూపేశ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరయ్యారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మా నాన్నలాగా తాను విడిచిపెట్టే ప్రసక్తే లేదని, టీడీపీలో ఉండి కష్టపడి పనిచేసి టిక్కెట్ విషయంలో బాధపడుతూ సభలో కంటతడిపెట్టారు. ఆ రోజు పరిస్థితులు వేరు, ఈ రోజు పరిస్థితులు వేరని తెలిపారు. 2021లో తాను జమ్మలమడుగులో టీడీపీ బాధ్యతలు చేపట్టానని, అప్పటి నుంచి రాష్ట్ర నాయకత్వం చెప్పిన విధంగా ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టానన్నారు. జమ్మలమడుగులో టీడీపీ టిక్కెట్ బీజేపీకి కేటాయించకుండా తనకే ఇవ్వాలని ఆయన తెలిపారు. వారం రోజుల నుంచి జమ్మలమడుగులో టీడీపీ టిక్కెట్ ఎవరికి ఇస్తారని కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెందుతున్నారన్నారు. అందులో భాగంగా నేరుగా ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేప్పేందుకే టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఖరారు కావడంతో తొలి జాబితాలో జమ్మలమడుగు టీడీపీ టిక్కెట్ భూపేశ్‌రెడ్డికి ప్రకటించేందుకు అనేక ఒత్తిడులు ఉన్నందున చంద్రబాబు ప్రకటించలేదని తెలుస్తోందన్నారు. ఏది ఏమైనా ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు.కాగా భూపేశ్‌రెడ్డికి అండగా నిలుస్తామని సమావేశంలో నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు.

కాగా ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి చిన్నాన్న గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇంటింటికి తిరిగి టీడీపీ అత్యధిక మెజార్టీ సాధించేందుకు ఎంతో కష్టపడ్డారన్నారు. 2024 ఎన్నికల్లో భూపేశ్‌రెడ్డి నిర్ణయం మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు నడుచుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం జనసేన నాయకులు నాగార్జున, టీడీపీ నాయకులు కేకే ఖదీర్, తుమ్మలూరు మల్లికార్జున, పొన్నతోట శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, తదితర నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.